క్లుప్తంగా

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎడవల్లి కృష్ణ

సుజాతనగర్: పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వవైభవం వచ్చేలా కృషి చేస్తానని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. పాత అంజనాపురం గ్రామంలో ధన్‌బాద్ సునీల్ నేతృత్వంలో పలు కుటుంబాలకు చెందిన వారు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటే పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, అంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరావు, కొప్పుల రమేష్, పైడిపల్లి మనోహర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు తండా గ్రామంలో సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బంజారా మహిళలు సంప్రదాయబద్ధంగా చేతుల్లో హారతులు పట్టుకొని జై సేవాలాల్ అంటూ ర్యాలీ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సేవాలాల్‌ను స్మరిస్తూ పాటలు పాడుతూ నృత్యాలతో సంబురం చేసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వండిన వంటకాలను సేవాలాల్ మహారాజ్‌కు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో మస్సివాగు సర్పంచ్ భూక్యా నందు, జరుపుల రాంచందర్, హతిరాంనాయక్, బాలకిషోర్, తారాచంద్, ప్రసాద్‌నాయక్, మోతీలాల్‌నాయక్, రాంజీ, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి



డ్యాన్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఓఎస్‌డీ టి.సాయి మనోహర్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో ఫన్‌ఫెస్ట్ మూడు రోజులుగా జరుగుతోంది. ఆదివారం చివరి రోజు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాయి మనోహర్ హాజరయ్యారు. మాట్లాడుతూ.. విద్యార్థులు సవాళ్లపై సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. అకౌంట్స్ అండ్ ప్రోగ్రాం అధికారి భానుచందర్, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ శ్రీనిజ, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీష్, మాచావరపు కోటేశ్వరరావు, సీఆర్‌ఓ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, శ్రీనివాస్‌సింగ్ ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

టేకులపల్లి: నిరుపేద వైద్యానికి ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఎల్‌ఓసీ చెక్కు అందజేసి ఆదుకున్నారు. రామచంద్రునిపేట గ్రామానికి చెందిన లింగాల రాంబాబు కుమార్తె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించి వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కుని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

బియ్యం పంపిణీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామపంచాయతీలోని గిరిజన గ్రామమైన గంగమ్మ కాలనీలో స్ట్రీట్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో కుటుంబానికి పది కేజీల చొప్పున 30 కుటుంబాలకు 300 కేజీల బియ్యాన్ని ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరి భార్గవ్, కల్యాణ్, పృథ్వీ పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ శిక్షణ తరగతులు

చుంచుపల్లి: విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని ఆదివారం కొత్తగూడెంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులు ప్రారంభించారు. అనంతరం శిక్షణ తరగతుల్లో కార్యకర్తలకు విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావం, సమాజంలో విశ్వహిందూ పరిషత్ లక్ష్యం, కార్యకర్త గుణగణాలు, సమాజంలో విశ్వహిందూ పరిషత్ విస్తరణ, ఆదర్శ హిందూ గృహం తదితర అంశాలపై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, దుర్గావాహిని, వాణిదేవి, పెరిక బాలాజీ, గడదాసు వెంకటేశ్వర్లు, రాము లోనియా, రేగడి విజయలక్ష్మి, చిలుకూరి నాగేశ్వరరావు, అవులూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కృష్ణయ్య కల్యాణం

- నాయకులగూడెం, కొమరారంలో ముస్తాబైన రాధాకృష్ణుల ఆలయాలు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం.. రేపు కల్యాణం



నాయకులగూడెంలో ముస్తాబైన రాధాకృష్ణుల ఆలయం

ఇల్లెందురూరల్: రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవానికి నాయకులగూడెం, కొమరారం గ్రామాలలోని రాధాకృష్ణుల ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. 6, 7వ తేదీలలో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించేందుకు గ్రామస్తులు ఆలయ ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇల్లెందు ఏజెన్సీలో రాధాకృష్ణుల ఆలయాలకు ఘన చరిత్ర ఉంది. నూరు శాతం ఆదివాసీలు నివసించే నాయకులగూడెం గ్రామంలో చాపల ముత్తయ్య అనే గిరిజనుడికి శ్రీకృష్ణుడు ఆవహించేవారని గ్రామస్తులు చెబుతుంటారు. ఆ సమయంలో ఆయన పలుకులు వాస్తవ రూపంలో ఉండేవని ప్రజల నమ్మకం. శ్రీకృష్ణుడు కలలో కనిపించి ఆదేశించడంతో సుమారు 50 సంవత్సరాల క్రితం చాపల ముత్తయ్య.. గ్రామ శివారులో శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మించారు. కొమరారం గ్రామంలో కోరం కోటమ్మ సైతం శ్రీకృష్ణుని పట్ల తనకు ఉన్న భక్తిభావాన్ని చాటుకుంటూ సుమారు నలభై ఏళ్ల క్రితం గ్రామంలో ఆలయాన్ని నిర్మించింది. నాటి నుంచి ఆయా గ్రామాలలో ప్రతిఏటా హోలీ పండుగ రోజున అత్యంత భక్తిశ్రద్ధలతో రాధాకృష్ణుల కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. మధురానగరంలో శ్రీకృష్ణుడు గోపికలతో వసంతోత్సవం నిర్వహించుకున్నట్లు పురాణాలలో ఉంది. అదేరోజున ప్రపంచ వ్యాప్తంగా రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా యాభై సంవత్సరాల క్రితం నాయకులగూడెం గ్రామంలో.. నలభై ఏళ్లకు పైగా కొమరారం గ్రామంలో నిర్మించిన రాధాకృష్ణుల ఆలయాలలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా సంక్రాంతి పర్వదినం రోజున రాధాకృష్ణుల వివాహ నిశ్చితార్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ రోజున ఏర్పాటు చేసిన ముహూర్తం ప్రకారం హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ రాధాకృష్ణుల కల్యాణాన్ని తిలకించేందుకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రాధాకృష్ణులకు మొక్కులు చెల్లించుకుంటారు.

నేటి నుంచి ఉత్సవాలు షురూ..

కొమరారం, నాయకుగూడెం గ్రామాలలో సోమవారం (6వ తేదీన) సాయంత్రం తలంబ్రాల బియ్యం సేకరణ, గ్రామదేవతలకు బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమవుతుంది. మంగళవారం ఉదయం 7:30కు సుప్రభాత సేవ, 8:30కు పంచామృతాభిషేకం, నిత్యపూజ, గోత్రనామార్చన, తీర్థప్రసాద వితరణ, 9:30కు గణపతిపూజ, స్వామివారికి ఉపనయనం, అమ్మవారికి గౌరీపూజ, 11:30కు స్వామివార్లకు ఎదుర్కోలు, మధ్యాహ్నం 1:15 గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం మహానైవేద్యం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తారు.



కొమరారం ఆలయంలో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలు

నలభై ఏళ్లుగా కల్యాణం జరిపిస్తున్నాం..



రాధాకృష్ణులపై భక్తితో నలభై ఏళ్లక్రితం గ్రామంలో ఆలయాన్ని నిర్మించుకున్నాం. నాటి నుంచి ప్రతి హోలీ పండుగ రోజు అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నాం. ప్రారంభంలో గ్రామస్తులే హాజరైన వేడుకకు.. క్రమంగా ఇతర మండలాలు, జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుండడంతో జాతర మహోన్నతంగా సాగుతోంది.

– కోరం కోటమ్మ, ఆలయ పూజారి, కొమరారం

యాదవ మహాసభ కమిటీ నియామకం



నియామకపత్రం అందిస్తున్న యాకయ్య

పాల్వంచ: అఖిల భారత యాదవ మహాసభ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా గంటా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మారుతి శ్రీనివాసరావు నియామకమయ్యారు. ఆదివారం స్థానిక నరిగె రమేష్ రైస్ మిల్ ప్రాంగణంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు యాకయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా బూడిద వీరస్వామి, మారబోయిప శ్రీను, రాము, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీను, దూదిమెట్ల లింగయ్య, కోశాధికారిఆ వి.వెంకన్న, మచ్చా నాగర్జున, ప్రచార కార్యదర్శి జి.మల్లయ్య, రమేశ్, వెంకన్న, రాములు, ఐలయ్య వీరబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. రెండో విడత గొర్రెల పంపిణీ బదులు నగదు బదిలీ చేయాలని, గొర్రెల కాపరులకు పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనారి పుల్లారావు, కుక్కల సాంబయ్య, మూడిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వంటగ్యాస్ ధర తగ్గించాలి



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ఇల్లెందు: సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతూ పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో వంట గ్యాస్ బండ ధర రూ.410 ఉండగా కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తొమ్మిది ఏళ్ల కాలంలో రూ.745 పెంచి ఇప్పుడు రూ.1155కు పెంచారని ధ్వజమెత్తారు. డీజిల్, పెట్రోల్ గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులు కొనే పరిస్థితి లేదన్నారు. ప్రధాన మంత్రి సబ్‌కా సాత్ సబ్కా వికాస్, ఆత్మ నిర్భర్ భారత్, అచ్చే దిన్ అంటూ.. చిలుక పలుకులతో ప్రజలు సచ్చేరోజు వచ్చిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా మోదీకి చరమగీతం పలకాలని కోరారు.

సతీష్‌కు నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న సతీష్

కొత్తగూడెంఅర్బన్: విజయవాడ మహిళా వాకర్స్ క్లబ్, వాసవీ క్లబ్ సూపర్‌స్టార్ విద్యాధరపురం సంయుక్తంగా రెండు తెలుగు రాష్ట్రాలలో విశిష్ట సేవ అందిస్తున్న ప్రముఖులకు ప్రతి ఏటా విశిష్ట సేవా నంది పురస్కారాలు అందిస్తుంది. 2023 పురస్కారాన్ని ఆదివారం విజయవాడ నగరంలో మేయర్ భాగ్యలక్ష్మి, వాకర్స్ క్లబ్ సభ్యులు రామలింగ రాజు చేతుల మీదగా అందుకున్నట్లు గుండపనేని సతీష్ అందుకున్నారు.

2014లో తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధుల, ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గాలను చూపటంతో పాటు, ప్రభుత్వాల నుంచి రావాల్సిన న్యాయబద్ధమైన వాటాను వారికి అందించటం, వారికి కల్పించాల్సిన అదనపు సౌకర్యాలను కల్పించే విధంగా కృషి చేయడం వంటివి నిర్వహిస్తున్నారు. దీంతో పాటు, పేద పిల్లలకు విద్య కోసం సహాయం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, సైకిళ్లు, అవసరమైన వస్తువులు పంపిణీ, దివ్యాంగుల పాఠశాల దత్తత తీసుకుని వారి అవసరాలను తీర్చడం వంటి కార్యక్రమాలకు గాను అవార్డుకు ఎంపిక చేశారు.

సమష్టి పోరాటాలతో సాధించుకుందాం..



ఇల్లెందురూరల్: పోలారంలో పాదయాత్ర నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: అన్ని వర్గాల ప్రజలు సంఘటితంగా పోరాడి కొమరారం, బోడు నూతన మండలాలను, ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌ను సాధించుకుందామని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ డిమాండ్‌తో మర్రిగూడెం నుంచి ప్రారంభమైన న్యూడెమోక్రసీ పాదయాత్ర రెండోరోజు ఆదివారం పోలారం నుంచి పోచారం తండాకు చేరుకుంది. ఈ సందర్భంగా పోలారం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష, వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నూతన మండలాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాంకుడోత్ సరోజిని, సంతు, మోకాళ్ల కృష్ణ, ఎంపీటీసీ ఈసాల పాపమ్మ, పాడుగు నర్సింహారావు, మోతీలాల్, దేవుజా, సీతారాములు, వీరన్న, హర్‌జ్యా, మంగ్యా, రాజు, మోడెం వెంకన్న, కిషన్, లచ్చు, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: బోడు మండల కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని చేపడుతున్న ఉద్యమాల్లో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం మండలంలోని పాతర్లగడ్డ, ఆర్‌సిపేట, ముర్రుట్ల,సంపత్ నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కల్తి వెంకటేశ్వర్లు, ఎట్టి నరసింహారావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

జూలూరుపాడు: డెంటిస్ట్ డే సందర్భంగా సోమవారం గుండెపుడి గ్రామంలో ఆరోగ్యం దంతవైద్యశాల డాక్టర్ షర్మిలచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుద్దుకూరి సుమంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపుడి శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోటి తలంబ్రాలకు శ్రీకారం



గోటితో తలంబ్రాలను వలుస్తున్న ఎంసీ కాలనీవాసులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ఎంసీ కాలనీ శ్రీ సీతారాముల కల్యాణంలో ఉపయోగించే గోటి తలంబ్రాల తయారీకి వేదిక అయింది. కొత్తగూడెం పరిసర ప్రాంతంలోని రైతుల వద్ద భక్తితో సేకరించిన వడ్లను కాలనీలో ఒకచోటకు చేర్చి 15 మంది మహిళలు తలంబ్రాలు తయారు చేసేందుకు వడ్లను వలిచే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. వీటిని నవమి సందర్భంగా భద్రాచలంలో జరగనున్న శ్రీసీతారామ కల్యాణ మహోత్సవానికి అందజేయనున్నారు. కార్యక్రమంలో వీణ, అరుణ, నాగలక్ష్మి, శ్రీదేవి, పద్మ, లక్ష్మి, శ్రీలత, రాధ, మాధవి, సరిత, పద్మావతి, సుమ, శ్రీవాణి పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి

ఇల్లెందు: ఈనెల 13న ఇల్లెందులో విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యుత్ శాఖ అధికారులు హాజరుఅవుతున్నారని, వినియోగదారులు విద్యుత్ సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని టీఎస్ఎన్‌పీడీఎస్ వరంగల్, సీజీఆర్‌ఎఫ్ -1 విభాగం చైర్మన్ సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

16న మండల సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: టేకులపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆలయానికి విరాళం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన ఏపీ రాష్ట్రం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని దొడ్డవరం గ్రామానికి చెందిన కాట్రగడ్డ సాంబశివరావు, కన్యాకుమారి దంపతులు రూ.5,116 విరాళాన్ని అందజేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా దంపతులు

పాల్వంచ: పాత పాల్వంచలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పుష్కర బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఐదో రోజు స్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రధాన పూజారి కందాల సింహాద్రి ఆనంద కుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు సమక్షంలో వేడుక నిర్వహించారు. అదేవిధంగా నవభారత్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ జయంతి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 6న శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, 7న అగ్ని ప్రతిష్ఠ శ్రీయాగం, పూర్ణాహుతి, దీపాలంకరణ సేవ, 8న శ్రీయాగం మహా పూర్ణాహుతి, లక్ష కుంకుమార్చన, స్వర్ణ పుష్పార్చన, వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు శేషాచార్యులు తెలిపారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న కెచ్చెర్ల కల్పన



మాట్లాడుతున్న సంధ్య

సింగరేణి(కొత్తగూడెం): మహిళల హక్కుల కోసం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కెచ్చెర్ల కల్పన పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని జిల్లా ఇఫ్టూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా కల్పన హాజరయ్యారు. మాట్లాడుతూ.. మార్చి 8 మహిళల హక్కుల దినంగా జరుపుకుంటూ మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సాంస్కృతిక సమస్యలపై చర్చించేందుకు, సంఘటితమయ్యేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారన్నారు. ముత్తమ్మ, సునీత, ఉపేంద్ర, సుజాత, చక్రి, విజయ, సునీత, స్వప్న, రాంబాయి, సిరి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వానికి పోరాడాలి..

ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై లవ్ జిహాది పురుష హత్యలపేరిట హిందుత్వ శక్తులు పాసిస్టు చర్యలకు పాల్పడుతున్నాయని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య విమర్శించారు. ఆదివారం రైటర్ బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా సదస్సులో సంధ్య మాట్లాడారు. మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు కారకులైన దోషులను పాలకవర్గాలు రక్షిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బయ్యా శారద, నోముల కళావతి, కల్తి రాములమ్మ, జాడి మంజుల, మడివి సంధ్య, వరలక్ష్మి, చిన్ని, లాలమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి నీరజ

సింగరేణి(కొత్తగూడెం): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నీరజ అన్నారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి హాజరయ్యారు. మాట్లాడుతూ.. ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించటానికి, వారి హక్కుల గురించి అవగాహన కల్పించటానికి, స్త్రీలను గౌరవించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనుబ్రోలు రాంప్రసాద్ మాట్లాడుతూ.. పురుషాధిక్యత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక రాజకీయ సమానత్వం కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా.. మహిళలు ఇంకా వివక్షకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లెనీనా, సీనియర్ న్యాయవాది రమేష్‌కుమార్ మక్కడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, మహిళా ప్రతినిధి గాదే సునంద, లీగల్ సర్వీసెస్ సభ్యులు మెండు రాజమల్లు, మహ్మద్ సాధిక్ పాష, కాసాని రమేష్, జి.శాంత, మారపాక రమేష్, షీ టీమ్ ఎస్ఐ రమాదేవి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్‌సీసీ హెడ్ శ్రీలత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నాగ శ్రవంతి, జ్యోతి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల పేరుతో మోసం..



ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో కేంద్రంలోని పాత కొత్తగూడెంలో అసలు ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా డబల్ బెడ్ రూంలో కేటాయింపుల పేరుతో భారీ కుంభకోణానికి అధికార టీఆర్ఎస్ పార్టీ తెరలేపిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పాత కొత్తగూడెంలోని డబల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల క్రితం పాత కొత్తగూడెంలో ఇల్లు లేని నిరుపేదలకు డబల్ బెడ్ రూం పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు ప్రకటించి ఎనిమిది వందల ఇళ్ల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారని, ఈ రోజుకీ అవి పూర్తి కాలేదని ఆరోపించారు. అంతేకాకుండా వాటిని వార్డుల వారీగా డ్రా పేరుతో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఓట్లు దండుకునేందుకు నాటకం ఆడారని విమర్శించారు. ప్రభుత్వ ప్రతిపాదిత డబల్ బెడ్ రూం ఇళ్లను తాను స్వయంగా పరిశీలించానని ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఎంతో పారదర్శకంగా డ్రా తీసినట్లు చెబుతున్నారని లబ్ధిదారుల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు, వారి బంధువుల పేర్లే అధికంగా ఉన్నట్లు చెప్పారు. డ్రా తీసే ముందు రోజే పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, ఒక్కొక్క లబ్ధిదారుల నుంచి రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు డిమాండ్ చేశారని ఆరోపించారు. డబల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో జరిగిన, జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, సాయి, చెనిగారపు నిరంజన్ కుమార్, తాటిపాముల హరికృష్ణ, వంగా రవిశంకర్, సందేల పవన్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించాలి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో వార్డుకు 20 మందికి చొప్పున లాటరీ ద్వారా మంజూరు చేసిన కార్యక్రమంలో జరిగిన అవకతవకలను సరిచేయాలని, అనర్హులను తొలగించి అర్హులకు ఇల్లు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం శేషగిరిభవన్‌లో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలోని 36 వార్డుల్లో 6,900 మంది డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఆఘమేఘాల మీద విచారణ చేసి రెండువేల మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. గ్రామసభలు పెట్టి అర్హులను ప్రకటించి, అనర్హులను తొలగించాల్సిన అధికారులు వారికి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించానపి ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల ప్రకారం అర్హులను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, అదేవిధంగా డ్రాలో రాని 1500 మంది లబ్ధిదారులకు పాత కొత్తగూడెంలో ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంచర్ల జమలయ్య, భుక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, పిడుగు సమాఖ్య, శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, మునిగడప పద్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న రమేష్

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కరోనా కాలంలో, విపత్తు పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, అనేక మంది రోగుల ప్రాణాలను కాపాడిన వారితో మొదటి వారియర్స్‌గా ఆస్పత్రి కార్మికులు నిలుస్తారని అటువంటి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉండగా వారికి అరకొర జీతాలను చెల్లిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా వారికి ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వటం లేదన్నారు. ఇప్పటికీ నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరన్న, భుక్యా రమేష్, లిక్కి బాలరాజు, తాటిపర్తి అనిల్, ఆది గంగా, భాగ్యలక్ష్మి, నవీన్, శివారెడ్డి, నాగరాజు, అవినాష్, రంజీత్, రమేష్, పవన్, రాము, సంతోష్, సాయి, మమత పాల్గొన్నారు.